
చెరకును కటింగ్ చేస్తున్న కూలీలు

నేటమ్స్ చక్కెర కర్మాగారం ముఖచిత్రం

ఐదేళ్లయినా బిల్లులివ్వరా?

- రూ.35 కోట్లు చెల్లించాల్సి ఉన్నా 'నేటమ్స్' యాజమాన్యం పట్టించుకోవడం లేదు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న చెరకు రైతులు

నగరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన చెరకును నేటమ్స్ చక్కెర కర్మాగారానికి తరలించి.. ఐదేళ్లు పూర్తవుతున్నా బిల్లులివ్వరా? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019-20 సీజన్‌లో చెరకును క్రషింగ్‌కు తరలించిన సుమారు ఎనిమిది వేల పైచిలుకు రైతులకు రూ.35కోట్లు చెల్లించాల్సి ఉన్నా ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల కొందరు రైతులు అప్పులు చెల్లించలేక భూములు అమ్ముకున్నారు. మిగిలినవారు బిల్లులివ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. 2019-20లో నేటమ్స్ చక్కెర కర్మాగార పరిధిలో సుమారు 13వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం 4వేల ఎరాల్లోనే చెరకు సాగు చేస్తున్నారు.

ప్రభుత్వం మారినా ఫలితం లేదు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బిల్లులకోసం జాతీయ రహదారిపై పలుమార్లు రైతులు ధర్నా చేసినా ఫలితం లేకపోయింది. ఓ ఫైనాన్స్ కంపెనీని అడ్డుపెట్టుకుని రైతులకు బిల్లులు ఎగ్గొట్టాలని నేటమ్స్ చక్కెర కర్మాగార యాజమాన్యం ప్రయత్నిస్తోందని రైతు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లులు వచ్చేస్తాయని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. యువగళం పాదయాత్రలో పిచ్చాటూరు వద్ద నారా లోకేశ్‌ను రైతు సంఘ నాయకులు కలిసి బిల్లుల సమస్యను తెలియజేశారు. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రిని తిరుపతి విమానాశ్రయంలో కలిసి బిల్లుల గురించి తెలియజేశామని రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.



రైతు ఎలా బతకాలి?

2019-20 క్రషింగ్ సీజన్‌లో నేటమ్స్ చక్కెర కర్మాగారానికి చెరకును సరఫరా చేయడంతో రూ.5లక్షల వరకు బిల్లులు రావాలి. వడ్డీతో కలిపి లెక్కిస్తే నేడు రూ.10 లక్షల పైగా నష్టపోయాను. ఇలాగైతే రైతు ఎలా బతకాలి.

- రామరాజు, విజయపురం

అప్పు తీర్చలేక పోతున్నా

నాకు ఎకరా పొలం ఉంటే.. ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని చెరకు పండించా. నాకు 'నేటమ్స్' నుంచి రూ.2లక్షలకు పైగా బిల్లులు రావాలి. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేకపోతున్నా. ప్రస్తుతం కూలీకెళుతున్నా.



- పచ్చమ్మ, విజయపురం

ముక్కంటి కంచుగడప నుంచే స్థానికులకు దర్శనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని ముక్కంటి ఆలయంలో స్థానికులకు కేటాయించిన టైంస్లాట్‌లో కంచుగడప నుంచే నేరుగా దర్శనానికి అనుమతిస్తామని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉదయం 6నుంచి 7.30గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 8.30గంటల వరకు దర్శనానికి అనుమతించేలా ప్రత్యేక టైంస్లాట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా స్థానికులు ఆధార్‌కార్డుతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి అనుమతి రసీదు పొందిన తరువాత కంచుగడప వద్ద చూపి ఆలయంలోకి వెళ్లేవిధంగా నిబంధనలు పెట్టారు.దీనిపై స్థానిక ప్రజలు తీవ్రఅభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి రసీదు తీసుకునే నిబంధనకు సడలింపు ఇస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. అయితే కంచు గడప వద్ద నేరుగా ఆధార్‌కార్డు చూపి దర్శనానికి వెళ్లవచ్చని ప్రకటించారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

విజన్ డాక్యుమెంట్ తయారీకి ఐఐటీ, ఐసర్ సలహాలు అవసరం

ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీలో ఐఐటీ, ఐసర్, ప్రముఖ యూనివర్సిటీల సబ్జెక్టు నిష్ణాతుల సలహాలు, సూచనలు అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఏర్పేడు ఐఐటీలోని కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, యూనివర్సిటీల సబ్జెక్టు నిపుణులతో తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కన్సల్టేటివ్ వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా గ్రోత్ రేట్ 15 శాతానికి తగ్గకుండా ఉండేలా పలు అంశాలపై చర్చించారు. పర్యాటక, ఆతిథ్య రంగం, విద్య, పరిశ్రమలు, మ్యానుప్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోషన్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వెంకటగిరి చీరలు, శ్రీకాళహస్తి కలంకారీ తదితర అంశాలపై నిపుణులు పలు సలహాలు, సూచనలు అందించారు. ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా పరిశ్రమల అవసరాల మేరకు నిపుణులను తయారు చేయాల్సి ఉంటుందని సూచించారు. గ్రామాలు, విద్యాసంస్థలు లింకేజీ చేయడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద్‌కుమార్, రాహుల్ సిరోహి, చంద్రశేఖర్, హేమంత్ కుమార్, ఉమాశంకర్, సత్య, నాగరాజు, రామారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, ఐసర్ అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరులో జోరు వాన


కొంగారెడ్డిపల్లెలో రోడ్డుపై నీటిప్రవాహం


మిట్టూరులో వర్షపునీటి ప్రవాహం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో శనివారం రాత్రి జోరువాన కురిసింది.ఉదయం నుంచీ చినుకులు రాలుతున్నప్పటికీ రాత్రి 8-9గంటల మధ్య ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది. రోజంతా కూడా విడతలవారీగా వాన పడడంతో ఉద్యోగులు, విద్యార్థులు అవస్థ పడ్డారు. చిరు వ్యాపారులకూ కష్టాలు తప్పలేదు. మరో మూడ్రోజులపాటు వర్షాలు కొనసాగుతాయని జిల్లా అధికారులు తెలిపారు.

విజయపురంలో 60.2 మి.మీ వర్షం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. విజయపురం మండలంలో అత్యధికంగా 60.2 మి.మీ, గుడిపాలలో అత్యల్పంగా 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. నింద్రలో 30.4, కార్వేటినగరంలో 14, నగరిలో 13.8, సదుంలో 12.4, సోమలలో 10.4, గుడుపల్లెలో 9.8, రొంపిచెర్లలో 8.4, పెనుమూరులో 5.8, పూతలపట్టులో 5.4, వెదురుకుప్పంలో 5.2, పులిచెర్ల, పెద్దపంజాణిలో 4, పాలసముద్రంలో 3.4, జీడీనెల్లూరు, కుప్పంలో 3, ఎస్ఆర్ పురంలో 2.6, ఐరాలలో 2.2, తవణంపల్లెలో 1.8, శాంతిపురంలో 1.2, చిత్తూరులో ఒక్క మి.మీ వర్షపాతం నమోదైంది.


కూలిన కల్లూరు ప్రభుత్వాస్పత్రి ప్రహరీ


ఆవులపెద్దిరెడ్డిగారి పల్లి వద్ద నేలవాలిన వరిపంట

వరిపంటకు నష్టం

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వాస్పత్రి ప్రహరీగోడ శుక్రవారం రాత్రి వర్షంతో నాని కొంతమేర కూలిపోయింది. పాతికేళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రహరీ ఇప్పటికే అనేక చోట్ల దెబ్బ తింది.ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రహరీ గోడ కొంత కూలింది.వర్షంతో బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్ద వరిపంటలు నీట మునిగాయి.ఇప్పటికే ఏనుగుల బెడదతో పంటలు నష్టపోయిన రైతాంగం వర్షాలతో కూడా వరిపంటకు నష్టం జరగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.


సోమలలో టమోటా పంటకు నల్లమచ్చ

ముసురువానతో టమోటాకు తెగుళ్లు

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముసురు వర్షంతో టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విడవని వానతో టమోటా తోటల్లో నీరు నిలిచి పంట దెబ్బ తింటోంది. పండ్లలో నాణ్యత తగ్గి గిట్టుబాటు ధర పలకడంలేదని రైతులు వాపోతున్నారు. ముసురువానలతో టమోటా తోటలకు ఎండ తగలకపోవడంతో కాయలపై మచ్చలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ధర కూడా పది రోజలుగా 15కిలోల బాక్సు రూ.1000 నుంచి రూ. 400కు చేరుకుంది.ఈ పరిస్థితుల్లో మరో అల్పపీడనం రాబోతోందన్న ప్రకటనతో రైతులు అయోమయంలో పడ్డారు. సోమల మండలంలో 300 ఎకరాలకు మించి టమోటా సాగులో ఉంది. పలువురు రైతుల తోటల్లో కోతలకు పంట సిద్ధమైంది.టమోటాకు మచ్చలు రావడంతో పాటు నాణ్యత తగ్గడంతో మార్కెట్‌కు తరలించలేక పొలాల వద్దే వదిలేస్తున్నారు.తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేద్దామన్నా ముసురు వానతో వీలుపడడం లేదు.మరోపక్క వేరుశనగ పొలాల్లో కూడా వర్షాలతో మొలకలు వస్తున్నాయి. మరో అల్పపీడనం వస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సోమలలో మొలకలొచ్చిన వేరుశనగ కాయలు

టీడీపీ నేతల చొరవతో కల్వర్టు పనులు

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు స్థానంలో తాత్కాలిక కల్వర్టు పనులను శనివారం ప్రారంభించారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లె నుంచి బసవపల్లె, బోనమంద, పేటూరు, ఎర్రగుంతలపల్లె మార్గంలో గార్గేయనది పొంగి ప్రవహించడంతో రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పాటు ఈ మార్గంలోని కల్వర్టు కొట్టుకుపోవడంతో జిల్లా స్థాయి అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాకపోకల పునరుద్ధరణకు టీడీపీ నాయకులు చొరవ తీసుకున్నారు. శనివారం ఉదయం నుంచి గార్గేయ నది వద్ద తాత్కాలిక కల్వర్టు పనులు చేపట్టారు. పంచాయతీ రాజ్ ఈఈ చంద్రశేఖర రెడ్డి, డీఈ కరుణాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, రెడ్డెప్ప నాయుడు, బాలాజీ నాయుడు తదితరులు కల్వర్టు పనులను పర్యవేక్షించారు.


పెద్దఉప్పరపల్లె సమీపంలో కల్వర్టు పనులు

కంటైనర్ బోల్తా




రోడ్డుపై పడిన కంటైనర్‌ను పక్కకు తీస్తున్న క్రేన్ - ట్రాఫిక్ స్తంభించడంతో బారులు తీరిన వాహనాలు

గంగవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు- బెంగళూరు బైపాస్ రోడ్డులో గంగవరం మండల పరిధిలోని వైఎస్సార్ జంక్షన్‌లో శనివారం భారీ కంటైనర్ బోల్తాపడింది.దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బెంగళూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్ బైపాస్ రోడ్డులో వేగంగా వస్తూ వైఎస్సార్ జంక్షన్ (దండపల్లె రోడ్డు జంక్షన్) వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్లు గమనించకుండా సడన్ బ్రేక్ వేయడంతో రోడ్డుపై బోల్తాపడింది. భారీ కంటైనర్ కావడంతో సుమారు గంటసేపు రోడ్డుపై వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.పోలీసులు క్రేన్‌ను తెప్పించి కంటైనర్‌ను పక్కకు తీయించడంతో వాహనాలు ముందుకు కదిలాయి. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుపక్కన ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో అధికారులు సిగ్నల్‌లైట్లు ఏర్పాటు చేసి , ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

టెట్‌కు 399 మంది హాజరు

చిత్తూరు సెంట్రల్,అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు శనివారం 399 మంది హాజరయ్యారు.జిల్లాలోని రెండు సెంటర్లలో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 460 మంది అభ్యర్థులకుగాను 399 మంది హాజరవగా, 61మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 230మంది అభ్యర్థులకు గానూ 198మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు, మధ్యాహ్నం సెషన్‌లో 230 మంది అభ్యర్థులకు గానూ 201మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు.


సీఎంకు చెక్కు అంద జేస్తున్న సుబ్రహ్మణ్య రాజు తదితరులు

సీఎం సహాయనిధికి ఆప్సా రూ.64 లక్షల విరాళం

తిరుపతి విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఆప్సా) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.64,04,854 అందజేసింది. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం రాత్రి విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్లు ఆయన ముఖ్యమంత్రికి చెప్పారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన

తిరుపతి (జీవకోన), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. చిత్తూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాకు చెందిన తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా భూమనను పలువురు అభినందించారు.

పొలం బాట



వాకాడు మండలం నిడిగుర్తి సమీపంలోని పొలాల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. వాకాడు డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం మల్లాం నుంచి మూల పడవ గ్రామానికి బయలుదేరింది. నిడిగుర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ప్రయాణికులు ఉలికి పాటుకు గురయ్యారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపు తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఎరక్కపోయి వచ్చాను..ఇరుక్కుపోయాను



నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టుకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేసే క్రమంలో పరిమితికి మించి కల్వర్టు ఎత్తు పెంచారు. దీంతో సెజ్‌లోకి వచ్చే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పైగా వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో శనివారం ఒక భారీ వాహనం ఆ ప్రాంతంలో ఇరుక్కుపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

జగనన్న కాలనీ జలమయం

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీ శనివారం జలమయమైంది. వేకువజామున 4 నుంచి 5 గంటల వరకు కురిసిన వర్షానికి పనస కాలువ నుంచి నీరు పొంగి జగనన్న కాలనీ వైపు ప్రవహించాయి. కాలనీలోని ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అక్కడ నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





కొండ శిఖరంపై



తటాకాల్లో ఈదులాడుతూ





నీటి మడుగు అడుగున దేవతా మూర్తితో - జలపాతం కింద



ఇక్కడే నివాసం

వనవాసి

ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, తల్లిదండ్రులెవరో తెలీదు. ఎలా వచ్చాడోగానీ పసి వయసు నుంచీ తిరుమలలో కనిపిస్తున్నాడు. ప్రసాదాలు తింటాడు.. బండలమీద పడుకుంటాడు.. ఒంటిమీద ఇంత గుడ్డ చుట్టుకుంటాడు.. ఉత్సవాల సమయాల్లో దివిటీలు పట్టుకునేవాళ్ల పక్కన చేరి తనూ అందుకుంటాడు. మాడవీధుల్లో తిరుగుతాడు. పేరు జైబాలాజీ. ఆ పేరును ఆయనే పెట్టుకున్నాడు. ఇప్పుడతని వయసు 50 ఏళ్లు ఉండచ్చు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం సమీపంలో కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకవైపు దట్టమైన చెట్ల నడుమ అతని నివాసం. పేర్చిన బండరాళ్ల మీద రేకు పైకప్పు. కరెంటుతో పనిలేదు. వంట లేదు. శ్రీనివాసుడి ఆరాధన తప్ప మరో ధ్యాస లేదు. చెట్టూ పుట్టా, పిట్టా పురుగూ, వాగూ వంకా.. తిరుమల అడవుల్లో ఆయనకు తెలియనివేవీ లేవు. భవిష్యత్తు గురించిన బెంగలేదు.. భయం అంటే ఏమిటో తెలీదు.. ఈ శేషాచలజీవికి. అడవిలో ఉంటే కాయాగసరూ తింటాడు. తిరుమలలో ఉంటే అన్నప్రసాదాలు తింటాడు. జైబాలాజీకి తెలియని తీర్థం, ఆయన ఎక్కని శిఖరం, దిగి తిరగని లోయ.. తిరుమల కొండల్లో లేవు. తిరుమల తీర్థాలకు ట్రెక్కింగ్ వెళ్లే బృందాలకు తోవ చూపుతాడు. వాళ్లతో కలిసి నడుస్తాడు. జలపాతాల కింద తడుస్తాడు. ఎత్తయిన బండలమీద నుంచి తటాకాల లోతుల్లోకి దూకి ఈదులాడుతాడు. తీర్థాల విశేషాలను వివరిస్తాడు. పిల్లనగ్రోవి ఊదుతూ ఏ పచ్చని చెట్టు కిందో ఉండిపోతాడు. తిరుమల అడవుల ఆనుపానులు తెలిసిన జైబాలాజీ కొంతకాలంగా యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాడు. అడవిలో ఆయన జీవనశైలిని చిత్రించి కొందరు వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యూట్యూబ్ స్టార్‌గా మారిపోయిన ఈ అడవిబిడ్డ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కుకు 'అధికార' చిక్కులు

- అధినేత హెచ్చరించినా దారికి రాని 'తమ్ముళ్లు'
- జిల్లాలో పలుచోట్ల షాపులు పెట్టనివ్వని వైనం
- లక్కులో దక్కినా తలపట్టుకుంటున్న యజమానులు

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో జోక్యం చేసుకుని చెడ్డపేరు తేవద్దంటూ సీఎం చంద్రబాబు గట్టిగా వార్నింగ్ ఇచ్చినా జిల్లాలో కొన్నిచోట్ల కొందరు కూటమి నాయకుల తీరు మారినట్లు కనిపించడంలేదు. ఆయన హెచ్చరిక జారీ చేసి 24 గంటలు తిరక్కుండానే కొందరు తెలుగు తమ్ముళ్లు గాలికొదిలేసి తమదైన పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అంతా తమ కనుసన్నల్లో జరగాల్సిందేనంటున్న వైనాలు జిల్లాలో బయటపడుతూనే ఉన్నాయి.

- ఏర్పేడు మండలానికి చెందిన 82వ నంబరు మద్యం షాపును పంగూరుకు చెందిన కిరణ్ కుమార్‌నాయుడుకు లాటరీలో దక్కింది. ఏ పార్టీకీ చెందని ఇతడు ఆమందూరు పంచాయతీ పరిధిలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఓ గది అద్దెకు తీసుకున్నారు. శనివారం మద్యం స్టాక్ తెచ్చుకున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడు తమ అనుచరులతో కలసి ఇతడ్ని అడ్డుకున్నారు. గంటపాటు గొడవ జరిగింది. నిస్సహాయుడైన యజమాని షాపు తెరవలేక మద్యం స్టాక్‌ను వెనక్కు తీసుకెళ్ళిపోయాడు. షాపు ఏర్పాటు వల్ల మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బంది అంటూ ఈ నాయకులు పైకి చెబుతున్నా అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధి మద్యం సిండికేట్ కీలక సభ్యుడని సమాచారం. మండల కేంద్రంలో షాపు ఏర్పాటు యత్నాల్లో ఉన్న తనకు ఆమందూరు పరిధిలో షాపు పెడితే వ్యాపారం తగ్గుతుందనే అడ్డుపడ్డారని తెలిసింది



ఏర్పేడులో షాపును స్థానికులు అడ్డుకోవడంతో మద్యం బాక్సులను వాహనంలో తరలిస్తున్న నిర్వాహకుడు

ఐదు షాపులు పెండింగ్

తిరుపతి రూరల్ మండలంలో 12 షాపులు కేటాయించగా ఇంకా ఏడు ఏర్పాటు కాలేదు. తిరుచానూరు సమీపంలో స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడికి లాటరీలో రెండు షాపులు వచ్చాయి. వాటిని ఇచ్చేయాలంటూ కూటమి పార్టీల నేతలు, మద్యం సిండికేట్ సభ్యులు అతడిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. తాము ఇచ్చినంత తీసుకుని వదిలిపెట్టేయాలని డిమాండ్ చేశారు. వినకపోవడంతో అతడి సోదరుడు, స్థానిక ప్రజాప్రతినిధి గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. ఆ దిశగా చర్యలకు కూడా దిగడంతో గత్యంతరం లేక రెండు షాపులూ సిండికేట్‌కే అప్పగించినట్టు సమాచారం.

బాలాయపల్లిలోనూ అదే పరిస్థితి

బాలాయపల్లిలో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తి పరిస్థితి కూడా డక్కిలి వ్యక్తి తరహాలోనే ఉందని టీడీపీ వర్గాల్లోనే ప్రచారమవుతోంది. షాపు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు భీష్మించుకోవడంతో ఇంతవరకూ లైసెన్సుదారు షాపు ఏర్పాటు చేయలేదని భోగట్టా..

గూడూరులో సెటిల్‌మెంట్!

గూడూరు పట్టణానికి ప్రభుత్వం పది షాపులు కేటాయించింది.అందులో ఇప్పటి వరకూ రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. ఎనిమిది పెండింగులో వున్నాయి. ఏ షాపులో ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలనేది అక్కడి ముఖ్యనేత వద్ద ప్రస్తుతం సెటిల్‌మెంట్ నడుస్తోందని సమాచారం.

డక్కిలి షాపులో వాటాకు పట్టు

డక్కిలి మండల కేంద్రంలో రెండు షాపులుండగా ఒకటి రాజకీయాలకు సంబంధం లేని తటస్త వ్యక్తికి దక్కింది. అతను షాపు ఏర్పాటు ప్రయత్నాల్లో ఉండగా అధికార పార్టీ నేతలిద్దరు షాపును తమకు ఇచ్చేయాలని పట్టుబట్టారు. యజమాని ఎదురు ప్రశ్నించడంతో పంచాయతీ ముఖ్యనేత వద్దకు వెళ్ళిందని తెలిసింది. తమ వాళ్ళు గత ఐదేళ్లలో బాగా నష్టపోయారని, కాబట్టి వారికి 40 శాతం వాటా ఇవ్వాలని పంచాయతీలో తేల్చి చెప్పారని సమాచారం. దీంతో షాపు యజమాని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది.

రేణిగుంటలో నేతల జోరు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో ఆరు లాటరీలో టీడీపీ అనుకూలురు దక్కించుకున్నారు. మిగిలిన నాలుగు షాపులూ వైసీపీ అనుకూలురకు దక్కాయి. ఆ నాలుగూ ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వాటిని ఏర్పాటు చేయకుండా ముఖ్యనేత పేరు చెప్పి అనుచరులు అడ్డుకుంటున్నారని తెలిసింది. షాపులు ఎలా నడుపుతారో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం.

ప్రారంభం కానిది 11 షాపులే

జిల్లాలో ఇప్పటి వరకూ 11 మద్యం దుకాణాలు మాత్రమే ప్రారంభం కాలేదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీ నేతలు గానీ సిండికేట్ పేరిట ఇతరులు గానీ లైసెన్సుదారులను అడ్డుకుంటున్నట్టు, బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తిలలో మాత్రమే 11షాపులు ఏర్పాటు కావాల్సి ఉందంటున్నారు. అవి త్వరలోనే ప్రారంభమవుతాయంటున్నారు.





ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీవో కిరణ్మయి - చికిత్స పొందుతున్న కార్మికులు

ఆటోను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి
- ఏడుగురు కార్మికులకు గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారి కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఉల్లా మునిరాజా(33) మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురి కార్మికులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... దొరవారిసత్రం మండలం ఏకొల్లు, పూలతోట గ్రామాల నుంచి తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలో ఉన్న ఓ పరిశ్రమలో పనిచేసే పది మంది కార్మికులు శనివారం విధులకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగ వద్ద వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకొల్లుకు చెందిన షకీనా, నీరజ, నిర్మల, ఈశ్వరి, పి.ఉదయ భాస్కర్, నేలపట్టుకు చెందిన పి.దేవి, విజయలక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన కార్మికులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో కిరణ్మయి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆటో డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. కంపెనీలు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో కార్మికులు ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ విషయాన్ని క్షతగాత్రులు ఆర్డీవో కిరణ్మయి దృష్టి తీసుకెళ్లారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.



మృతి చెందిన మునిరాజా(ఫైల్‌ఫొటో)

నాలుగు రోజుల్లో రూ.49.38 కోట్ల మద్యం విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజుల్లో రూ.49.38కోట్ల విక్రయాలు జరిగాయి. 227 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా ఇప్పటివరకు 218 ప్రారంభమయ్యాయి. ఇందులో తిరుపతి డివిజన్ పరిధిలో 125, గూడూరు డివిజన్ పరిధిలోని 93ఉన్నాయి. శనివారం వరకు 16,890 కేసుల బీర్లు, 9,179 కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.49.38 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలోని మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మార్పీకి విక్రయించకపోయినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. తిరిగి శనివారం వేకువజామున గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. తొట్టంబేడు మండలంలో 79.మి.మీ., బుచ్చినాయుడుకండ్రిగ 72.4, శ్రీకాళహస్తి 68.8, పిచ్చాటూరు 50.4, పెళ్లకూరు 50.2, దొరవారిసత్రం 48.2, నాగలాపురం 45.4, చిల్లకూరు 39.2, గూడూరు 37.4, ఏర్పేడు 34.2, సత్యవేడు 32.6, సూళ్లూరుపేట 32.4, రేణిగుంట 27.2, పాకాల 25.2, బాలాయపల్లి 24.8మి.మీ వర్షపాతం నమోదైంది.

స్కూల్‌వ్యాన్ బోల్తా ..పిల్లలు క్షేమం

కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూల్ వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. అయితే పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాను శనివారం సాయంత్రం విద్యార్థులను ఇంటివద్ద దించడానికి కొండల్లో ఆదవరానికి బయలుదేరింది. ఎస్‌ఎల్‌పురం వద్ద ఎదురుగా కారుకు రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను కాస్త పక్కకు తిప్పారు. దీంతో వ్యాను మట్టిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వ్యానులో ఏడుగురు పిల్లలు ఉన్నారు. వ్యాను ఒరుగుతుండగానే అందరూ దిగేశారు. ఎవరికీ గాయాలు కాలేదు. కాగా సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డును మరింత విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బోల్తా పడిన స్కూల్‌వ్యాన్



భక్తులతో కిటకిటలాడిన అలిపిరి



తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఎంతో పవిత్రంగా భావించే పెరటాసి మాసం ఐదో శనివారం కావడంతో తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులతో అలిపిరి కిటకిటలాడింది. అలిపిరి పాదాల మండపం నుంచి గాలిగోపురం వరకు భక్తులు పోటెత్తారు. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.



సఫాయి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల సేవలో తరిస్తున్న సఫాయి కర్మచారి(పారిశుధ్య కార్మికులు)లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా వర్తింపజేయాలని, వారికి ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ వైద్యాధికారులకు ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ వెంకటేశన్

రుయాస్పత్రి, స్విమ్స్‌లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రుయాస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, డ్యూటీలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు తెలిపారు. వెంటనే ఆయన కాంట్రాక్టు నిర్వాహకులను పిలిచి మందలించారు. బిల్లులు రాకపోవడం వల్ల జీతాలు ఇవ్వడం కొంత ఆలస్యమైందని ఏ-1 కాంట్రాక్టు నిర్వాహకుడు రవికుమార్ చెప్పగా వెంటనే ఫోన్లో డీఎంఈ నరసింహులుతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికులకు పది రోజుల్లో జీతాలు చెల్లించాలని, నిబంధనల మేరకు వారికి సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టు నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం స్విమ్స్‌కు చేరుకుని స్విమ్స్ అధికారులు, సఫాయి కార్మికులు, కర్మచారీ సంఘం నేతలతో సమీక్షించారు. అక్కడ సఫాయి కార్మికులకు అందిస్తున్న సదుపాయాలను, జీతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్నీ సకాలంలో అందుతున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన కార్యాలయ నంబరు 011-24648924కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్ఎంవో హరికృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలి

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ తెలిపారు. శనివారం తిరుపతి కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుల సమస్యలపై కమిషనర్ మౌర్యతో కలసి సమీక్షించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మస్టర్ గదులు తక్కువగా ఉన్నాయని, మహిళల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

రాజనాలబండ మహిమ


బంగారు నగలతో స్వామికి పూజ చేస్తున్న అజయ్‌బాబు కుటుంబీకులు

చౌడేపల్లె, అక్టోబర్19: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో సత్యప్రమాణం అనగానే చోరీకి గురైన బంగారు తిరిగి లభించిన ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు... వాల్మీకిపురం మండలం చెరకువారికిపల్లెకు చెందిన అజయ్‌బాబు తన ఇంటి బీరువాలో ఉంచిన బంగారు నగలు గత ఏప్రిల్ నెలలో చోరీ అయ్యాయి. అప్పుడు గ్రామ పెద్దల సలహామేరకు రాజనాలబండ ఆలయ నిర్వాహకుల వద్ద అనుమతి తీసుకుని చుట్టుపక్కల ఇళ్ల వారితో కలసి సత్యప్రమాణానికి వచ్చారు. ఆలయ నిర్వాహకుల విచారణలో సత్యప్రమాణం చేయకుండానే ఓ వ్యక్తి చోరీ చేసినట్లు, ఓ వ్యాపారి వద్ద నగలు కుదవ పెట్టానని, తనకు కొంత సమయం కావాలని కోరారు. చోరీ జరిగిన నగలను తాకట్టు నుంచి విడిపించి బంగారు చైను, గాజులను ఆలయ నిర్వాహకుల సమక్షంలో వారికి ఇచ్చారు. స్వామి దయతోనే తన నగలు తిరిగి లభించాయని వారు స్వామికి పూజలు చేశారు.

ఈ బొరుగులు రుచే వేరు!


పల్లీలతో స్పెషల్‌గా బొరుగులు

చిత్తూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఇస్మాయిల్ బొరుగుల రుచి ఓసారి చూశారంటే మళ్లీ మళ్లీ రావాల్సిందే. అందుకే సామాన్యుడి నుంచి అధికారుల వరకూ ఈ బొరుగులను రుచి చూస్తుంటారు.12 రకాల రుచులతో బొరుగుల మిక్చర్ తయారు చేస్తాడీయన. రోజూ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ బండి వద్ద జనం కిటకిటలాడుతుంటారు.మిరియాల మసాలా, టమోటా మసాలా, ఆనియన్ స్లైస్, పల్లీ, నెయ్యి మసాలా, లెమన్ మసాలా వంటివి ఇక్కడ ప్రత్యేకం. మసాలా బొరుగులను రూ.15, టమోటా స్లయిస్, నెయ్యి తదితర రకాల బొరుగులను రూ.20కి అమ్ముతాడు. ఇక చిన్న పిల్లల కోసం కూడా సాదా బొరుగులను అమ్ముతుంటాడు. ఇందులో కారం, ఇతరరకాల మసాలాలను కలపరు. పల్లీలు, కొత్తిమీర, పుదీనా, క్యారెట్, ఉప్పు, నిమ్మరసాన్ని మాత్రమే కలుపుతారు. ఇస్మాయిల్ తాత దోతి సాహెబ్, తండ్రి అక్బర్ తోపుడు బండిపై ఊరూరా తిరిగి ఇదే వ్యాపారం చేశారట. ఇస్మాయిల్ మాత్రం 1995 నుంచి చిత్తూరు బస్టాండు సమీపంలో చిన్నపాటి తోపుడు బండిపై ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నానని చెప్పాడు.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

ముగిసిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన


అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష (ఎస్ఎస్)లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టుల కోసం అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శనివారం డీఈవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. సీఆర్‌టీ ఇంగ్లీష్ పోస్టులు 2, ఫిజిక్స్ ఒకటి, పార్టుటైం టీచర్స్ 5, పీజీటీ సివిక్స్ ఒకటి, కామర్స్ ఒకటి, వార్డెన్లు 2, అకౌంటెంట్ ఒక పోస్టుకుగాను 1:3 రోస్టర్ ప్రకారం 34 మందిని పిలవగా 22 మంది హాజరైనట్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్ జయప్రకాష్, జీసీడీవో ఇంద్రాణి తెలిపారు. వీరి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేశామని, నివేదికను ఏపీసీ ద్వారా కమిటీకి సమర్పిస్తామన్నారు. కేవలం మెరిట్ ఆధారంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ చైతన్య, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

థెరపీ మేనేజర్ ఆత్మహత్య


తేజేశ్వర్‌రెడ్డి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చిత్తూరులో జరిగింది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మెసానికల్ మైదానం సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. తిరుపతిలోని ఓ కంపెనీలో థెరపీ మేనేజర్‌గా తేజేశ్వర్‌రెడ్డి పనిచేస్తున్నట్లుగా ఓ గుర్తింపు కార్డు లభించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



జిల్లా జట్టుకు ఎంపికైన బాలబాలికల జట్లు

చౌడేపల్లె, అక్టోబర్19: జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శనివారం స్థానిక హైస్కూల్‌లో జిల్లాలోని హైస్కూల్స్, జూనియర్ కాలేజిల నుంచి 400 మంది క్రీడాకారులు వచ్చారు. వర్షం రావడంతో ఇండోర్‌లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన బాలిక జట్టులో పల్లవి, లిఖిత, సన, పంచల లోహిత, సోఫియా, అంజుమ్, హేమావతి, హేమశ్రీ, శాలిని. భాగ్యశ్రీ, కౌసల్య, సంధ్య, అనిత, డోలశ్రీ, నందిని, రమ్యలు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అలాగే బాలుర విభాగంలో సందీప్, తిరుమలేష్ యాదవ్, మహేంద్ర నాయుడు, మనోజ్, నిరంజన్, జాన్‌పీటర్, చరన్, సన్‌జై, దర్శిన్, శివకేశవ, సుజిత్‌కుమార్, జోయల్, కిరన్‌కుమార్ రెడ్డి, గణేష్, తిరుమల, బాలు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. క్రీడలు నిర్వహణకు మేకలచిన్నేపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త నవీన్‌బాబు రూ..50వేలు విరాళం ఇచ్చారు. దాతను హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్యదర్శి వసంతవాణి, ఎంఈవో కేశవరెడ్డి, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ రాధిక, విశ్రాంతి పీడీ రామచంద్ర, పీఈటీ రాజేంద్ర పాల్గొన్నారు.

కొత్త షాపుల్లో పాత మద్యం

అందుబాటులోకి రాని నాణ్యమైన బ్రాండ్లు

చిత్తూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్త సీసాలో పాత సారా అన్నట్లుంది నూతన మద్యం పాలసీ. కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమై మూడు రోజులవుతున్నా.. ఒకట్రెండు మినహా వైసీపీ హయాం నాటి 'జే' బ్రాండ్లే అందుబాటులో ఉన్నాయి.ధరలు కూడా అప్పటివే అమలవుతున్నాయి. సీఎం చంద్రబాబు చెప్పినట్లు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చేందుకు మరికొంత సమయం పట్టేలా ఉంది.కొత్త మద్యం పాలసీ అమలుకాక ముందువరకూ నిర్వహించిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సరుకును డిపోకు తరలించి కొత్త సరుకు సరఫరా చేశామని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. కానీ, ఆ సరుకులో కూడా ఒకట్రెండు మినహా అన్నీ పాత బ్రాండ్లే ఉన్నాయి.కొన్ని దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే 10 శాతం అధికంగా వసూలు చేస్తుండడంతో మద్యం ప్రియులు అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు.వైసీపీ హయాంలో అప్పుడప్పుడు దొరికే కింగ్ ఫిషర్ బీర్ రూ.220 ఉండేది. ఇప్పుడూ దాని ధరలో మార్పు లేదు. డిమాండ్ ఎక్కువున్న బడ్వైజర్ బీరు ఊసే లేదు. ఇంపీరియల్ బ్లూ, ఎంసీ విస్కీ మినహా మద్యం బ్రాండ్లన్నీ వైసీపీ హయాం నాటివే ఉన్నాయి. రాయల్‌గ్రీన్, ఎంహెచ్, బీ7, రాయల్ స్టాగ్ తదితర బ్రాండ్ల క్వార్టర్ బాటిళ్లు సైతం గతంలోలాగే రూ.220 నుంచి రూ.230గా అందుబాటులో ఉన్నాయి. నూతన మద్యం పాలసీలో కీలకమైన రూ.99కే క్వార్టర్ బాటిళ్లు శుక్రవారం జిల్లాకు రావడంతో.. రాత్రి కొన్ని దుకాణాలకు సరఫరా చేశారు. ఈ విషయమై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడగా పాత స్టాకు అమ్మకాలు పూర్తవగానే కొత్త స్టాకు దుకాణాల్లోకి వస్తుందని చెప్పారు.ఇదంతా జరగాలంటే వారం పట్టొచ్చని, కొత్త ధరలు కూడా అప్పటి నుంచే అమలులోకి వస్తాయని చెప్పారు.ఇప్పటికే వచ్చి ఉన్న పాత స్టాకును కొత్త మద్యం దుకాణాలకు సరఫరా చేయాల్సి వచ్చిందన్నారు.

తగ్గిన టమోటా ధరలు

పుంగనూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టమోటా ధరలు తగ్గుముఖం పట్టాయి.తుపాన్ కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని ఆకుముడత, ఆకునల్లగా మాడిపోవడం, టమోటాకు నల్లమచ్చలు రావడం తదితర కారణాలతో ధరలు తగ్గాయి, ఈనెల 1వ తేది పుంగనూరులో కిలో రూ.46 నుంచి టమోటా డిమాండ్‌ను బట్టి కిలో రూ.75 వరకు పలికింది. కాగా శుక్రవారం నాణ్యతను బట్టి కిలో రూ.54.70, రూ.51.40. రూ.47.40, శనివారం మొదటి రకం రూ.39.40, రెండోరకం రూ.36.70, మూడోరకం రూ.33.40 చొప్పున మార్కెట్‌కు వచ్చిన 34.26 మెట్రిక్‌టన్నుల టమోటాను వ్యాపారులు కొనుగోలు చేసి డిమాండు ఉన్న ప్రాంతాలకు తరలించారు. ఈనెలలో ఆశించిన ధరలు పలుకుతుండగా వర్షం వల్ల మళ్లీ పంటలు దెబ్బతినడంతో ధరలు తగ్గుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పాస్‌పోర్ట్ పొందడం... సులభతరం

● ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పిస్తే చాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ అనేది ఒకప్పుడు స్టేటస్ సింబల్. సంపన్న వర్గాలకే పరిమితమయ్యేది. కాలం మారింది. విద్యారంగ మార్పుల ఫలితంగా సాధారణ విద్యార్థి కూడా విదేశమెళ్లి ఉద్యోగం చేస్తున్నాడు. మధ్య తరగతి వారు వెళుతున్నారు. గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు పెరిగి చదువుతో పనిలేకుండా వలసబాట పడుతున్నారు. దీంతో అన్ని వర్గాలకూ ఇప్పుడు పాస్‌పోర్ట్ అవసరంగా మారిపోయింది. అందుకే గతంలో ప్రహసనంగా ఉండే దరఖాస్తు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసింది. పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాయకుండా ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.



యాప్ ద్వారా దరఖాస్తు ఇలా..

- కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్‌లో ఎం.పాస్‌పోర్ట్ అనే సేవాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేశాక న్యూ యూజర్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయాలి.
- చిరునామా ఆధారంగా పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఎంచుకోవాలి.
- పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్ ఐడీ లాంటి సమాచారం నమోదు చేయాలి. లాగిన్ ఐడీ అయ్యాక పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. సెక్యూరిటీ కోసం ఓ ప్రశ్న, సమాధానం ఎంచుకోవాలి. క్యాప్చా కోడ్‌ను కూడా నమోదు చేసి సబ్మిట్ వద్ద క్లిక్ చేయాలి. ఐడీ, పాస్‌వర్డ్‌లను మాత్రం మర్చిపోకూడదు సుమా.
- పాస్‌పోర్టు కార్యాలయం ద్వారా దరఖాస్తుదారుడి మెయిల్‌కు ఓ ధ్రువీకరణ లింకు వస్తుంది. దీన్ని క్లిక్ చేస్తే వెబ్ పేజీ ఓపెన్ అవుతుంది. ధృవీకరణకు మీ లాగిన్ ఐడీ నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఖాతా ధ్రువీకరించుకుని యాప్‌ను క్లోజ్ చేసి మళ్లీ లాగిన్ చేయాలి.
- అప్లై ఫర్ పాస్‌పోర్టు వద్ద మళ్లీ క్లిక్ చేయాలి. అక్కడ కోరిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఆధార్, చిరునామా వివరాలు తప్పనిసరి. తర్వాత పాసుపోర్టు కోసం ఆన్‌లైన్‌లో రూ.1,500 చెల్లించాలి. అపాయింట్‌మెంట్ తేదీని నిర్ణయించుకుని సంబంధిత కాలమ్‌లో ప్రస్తావించాలి.
- దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక పాస్‌పోర్టు కేంద్రానికి వెళ్లి అవసరమైన పత్రాలను అందజేయాలి.
- సర్టిఫికెట్లు ఓకే అయ్యాక కొన్ని రోజుల్లోనే పోలీసు వెరిఫికేషన్ జరుగుతుంది. స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ వచ్చి నేరచరిత్ర లాంటి వివరాలపై విచారిస్తారు. అనంతరం వారం రోజుల్లో ఇంటికి పాస్‌పోర్టు అందుతుందని పాస్‌పోర్టు సేవా కేంద్రం అధికారులు చెప్పారు.

నిబంధనలు గాలికి..

● పుట్టగొడుగుల్లా అనధికారిక మందుల దుకాణాలు
● డాక్టర్ల చీటీలు లేకుండానే విక్రయాలు ● ప్రజల ప్రాణాలతో చెలగాటం
● మామూళ్ల మత్తులో వైద్యాధికారులు

తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

● తిరుపతికి చెందిన ఓ యువతి గర్భం దాల్చింది. దాన్ని పోగొట్టుకునేందుకు మందుల కోసం తిరుపతిలోని ప్రైవేటు దుకాణాన్ని ఆశ్రయించింది. డాక్టరు చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదని, అలా ఇవ్వాలంటే అదనంగా నగదు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారుడు చెప్పాడు. గత్యంతరం లేక ఎమ్మార్పీ కంటే రెండింతల ధర పెట్టి మందులు కొనుగోలు చేసింది. వాటిని ఇష్టానుసారం వాడటం వల్ల తీవ్ర రక్తస్రావమై ప్రాణం మీదకు తెచ్చుకుని ఆస్పత్రి పాలైంది.

● శ్రీకాళహస్తికి చెందిన సురేష్ తన ఐదేళ్ల కుమారుడు దగ్గు, జలుబుతో బాధపడుతుండటంతో పట్టణంలోని ఓ మందుల దుకాణానికి వెళ్లి విషయం చెప్పాడు. దుకాణ యజమాని మందులు ఇచ్చి, మూడు రోజులు వాడమని చెప్పాడు. ఆ మందులు వాడినా ఎలాంటి ఉపయోగమూ లేకపోగా బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించింది. చివరకు డాక్టరు దగ్గరకు వెళ్లారు. బాలుడిని రెండు రోజులు ఆస్పత్రిలో ఉంచి రూ.10 వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.



తిరుపతి జిల్లాలో ఇటువంటి ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నా సంబంధిత వైద్యాధికారులు కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లావ్యాప్తంగా 2,700 లైసెన్సు కలిగిన మందుల దుకాణాలు ఉంటే అందులో తిరుపతిలో 600లకు పైగా ఉన్నాయి. లైసెన్సు లేకుండా 500కు పైగా కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో సగటున రోజుకు రూ.6 నుంచి 8 కోట్ల వ్యాపారం జరుగుతోంది. అర్హత లేకనే మందుల(ఔషధ) దుకాణాలు పెట్టేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైద్యుల సిఫారసు లేకుండా ఇస్తున్న మందులతో రోగుల ప్రాణాల మీదకు వస్తోంది.

నిబంధనలు ఇలా..

- మందుల దుకాణం ప్రారంభించాలంటే ముందుగా ఔషధ నియంత్రణ అధికారుల అనుమతి తీసుకోవాలి.
- దుకాణంలో డీఫార్మసీ పూర్తి చేసిన ఫార్మాసిస్టు తప్పక అందుబాటులో ఉండాలి. అనుమతి వారి పేరుతోనే ఉండాలి.
- మందుల విక్రయాలు పూర్తిగా డాక్టరు చీటి ఉంటేనే విక్రయించాలి. కొనుగోలు చేసిన, విక్రయించిన మందుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి.

అమలు చేసేవారేరి?

- మందుల విక్రయదారులకు తప్పక బిల్లు చెల్లించాలి. కానీ జిల్లాలో ఎక్కడా జరగడం లేదు.
- ఇరకు గదుల్లోనూ దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.
- ఫార్మసీ చదివిన వారు లేకనే మందుల దుకాణాలు కొనసాగుతున్నాయి. అవగాహన లేకనే మందులు ఇచ్చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.
- ఔషధ దుకాణాలకు ఐదేళ్లకొకసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉండగా పాటించడంలేదు.


ఇరుకు గదిలో మందుల దుకాణం

పత్తాలేని అధికారులు..

జిల్లాలో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు ఒకరు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఉన్నారు. వీరు మందుల దుకాణం ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో కొలతలు, నిబంధనలు పరిశీలించాలి. నెలలో ఒకసారైనా దుకాణాలను తనిఖీ చేయాలి. ఆ దిశగా ఎక్కడా కనిపించడం లేదు. ముడుపులు అందుతుండడం వల్లే అటువైపు చూడడం లేదన్న విమర్శలున్నాయి. దుకాణాలు పక్క ప్రాంతాల్లోకి మార్చుకోవాలన్నా లేదా ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నా అదనంగా ముడుపులు చెల్లించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. ఇదే వ్యవహారంలో ఇటీవల గూడూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీకి చిక్కారు.

పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు : డీపీవో



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న డీపీవో పార్వతి

వి.కోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తప్పవని డీపీవో పార్వతి అన్నారు. శనివారం వి.కోట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆమె సర్పంచ్ పీ.ఎన్.లక్ష్మితో మాట్లాడి పంచాయతీ అభివృద్ధిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వి.కోట పరిధిలో ఇద్దరు డెంగ్యూ జ్వరాలతో మృతి చెందిన ప్రాంతాల్లో పారిశుధ్యంపై సమీక్ష జరిపారు. అలాగే ఈవోతో మాట్లాడి పంచాయతీలో ట్యాక్స్ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్మికులు ఆమె దృష్టికి పలు సమస్యలు తీసుకువచ్చారు. కార్మికులకు అవసరమైన వస్తువులను ఆమె చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఈశ్వరన్, పంచాయతీ ఈవో శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శం కావాలి



జ్యోతి వెలిగించి పట్టుకున్న నర్సింగ్ విద్యార్థులు

కుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తిలో ఉన్న ప్రతివొక్కరూ ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం నర్సింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులు దీపం వెలిగించే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీఎన్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు తెల్లటి యూనిఫామ్ ధరించి వారి కెరీర్‌లో సైద్ధాంతిక అభ్యాసం నుంచి ఆచరణాత్మక అనువర్తనానికి మళ్లే పరివర్తనకు దీపం వెలిగించడం ఒక నిదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులందరూ దీపం వెలిగించి వృత్తిలో శాంతి సహనశీలతతో వ్యవహరిస్తామని ప్రతిన చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పర్యావరణ పాత్ర ప్రధానం



పీఈఎస్‌లో ఈఎంఈ ప్రారంభిస్తున్న డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు

కుప్పం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై పర్యావరణ పాత్ర ప్రధానంగా పనిచేస్తుందని వైద్య ప్రముఖులు పేర్కొన్నారు. పీఈఎస్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకోసం 'జంతువుల కాట్లు, విషప్రయోగం: మానవులు, జంతువులు, పర్యావరణం' అనే అంశంపై సతత విద్య కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జంతువుల కాట్లు, పాముల కాట్లు, జునోటిక్ వ్యాధులు, ఎమర్జింగ్ వన్ హెల్త్ ధోరణుల గురించి నిపుణులు చర్చించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ చిత్రా నాగరాజ్, బెంగళూరు కిమ్స్ యాంటీ రేబిస్ క్లినిక్ విభాగాధిపతి డాక్టర్ గిరియన్నగౌడ, కృష్ణగిరి టీసీఆర్ హాస్పిటల్ టాక్సికాలజిస్ట్ సి.సౌందరరాజ్, కోలార్ ఎస్ఎం.రీజియన్ రీసెర్చ్‌ఆఫీసర్ డాక్టర్ నటరాజ్ హాజరయ్యారు.

పశువులను కళేబరాలకు తరలిస్తున్న ఇద్దరిపై కేసు

కల్లూరు,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న తమిళనాడుకు చెం దిన ఇద్దరి వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కల్లూరు హైవేపై శుక్రవారం రాత్రి పీలేరు నుంచి కాడ్పాడికి వెళుతున్న ఓ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీచేశారు. రెండు ఆవులు, రెండు లేగదూడలను కళేబరాలకు తరలిస్తుం డటాన్ని గుర్తించారు. కాడ్పాడికి చెందిన పశువుల వ్యాపారి సద్దాం, డ్రైవర్ ముబారక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో నాలుగు పశువులను కుక్కి ఉంచడంతో ఒక ఆవు ఊపిరాడక మృతి చెందింది. దీంతో కల్లూరు పశువైద్యాధికారి మునిచంద్ర మృతి చెందిన పశువుకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. మిగిలిన 3 పశువులను తిరుపతి జిల్లా తిరుచానూరులోని గోశాలకు తరలించారు. ఈ మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రొచ్చురొచ్చుగా యానాదికాలనీ దారి



రామకుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేట పంచాయతీ యానాదికాలనీకి రహదారి సౌకర్యం లేక గ్రామస్థులు అవస్థలకు గురవుతున్నారు. సుమారు 50యనాది కుటుంబాల వారు నివసిస్తున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. గుంతలమయంగా మారిన దారిలో వర్షపునీరు నిల్వ ఉండటంతో రొచ్చురొచ్చుగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. సత్యలోకం సమీపంలోని హంద్రీ-నీవా కాలువ ప్రాంతం నుంచి వెళ్ళే దారితోపాటు, రాజుపేట నుంచి వెళ్ళే మరో దారి పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. పాలకులు, అధికారులు స్పందించి హంద్రీ-నీవా కాలువ నుంచి తమ గ్రామం మీదుగా రాజుపేటకు తారురోడ్డు నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని యానాదికాలనీవాసులు కోరుతున్నారు.

దేవళంపేట వీధుల్లో బురద నీరు



దేవళంపేటలోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దేవళంపేటలోని వీధులంతా బురద నీళ్లతో నిండిపోయాయి. పలు వీధుల్లో రోడ్లు గుంతలమయంగా మారడం, సిమెంటు రోడ్లు లేకపోవడంతో వర్షం పడినప్పుడు బురద నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లాలంటే బురద నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇదే పంచాయతీ దిగుమూర్తివారిపల్లికి వెళ్లే రోడ్డులో బురదనీళ్లు నిలిచిపోవడంతో ఆ గ్రామంలోకి వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

శబరిమలైలో కూటమి నాయకులు

పుంగనూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. పుంగనూరు మండల జనసేన అధ్యక్షుడు విరూపాక్షి ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 మంది పార్టీ శ్రేణులు 41 రోజులు అయ్యప్పదీక్ష చేపట్టి మొక్కుతీర్చుతామని అయ్యప్పస్వామిని గత ఏడాది మొక్కుకున్నామని, అందులో భాగంగా శబరిమలై వెళ్లి ప్రత్యేక పూజలు చేశామన్నారు. పుంగనూరు మండలం మోదుగులపల్లె, సుగాలిమిట్టకు చెందిన జనసేన, టీడీపీ శ్రేణులు 40 మంది 6 వాహనాల్లో వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.



పలమనేరు

కుప్పం/పుంగనూరు

రోడ్డుపైనే సంత





సంతలో షెడ్లు లేక గుడారాల్లోనే దుకాణాలు, సంతలో ట్రాఫిక్ సమస్యతో బారులు తీరిన వాహనాలు

శాంతిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం బడుగుమాకులపల్లెలో ప్రతి ఆదివారం జరిగే సంతలో పలు సమస్యలు తాండవిస్తున్నాయి. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపైనే ఏళ్ళ తరబడి ఈ సంత కొనసాగుతోంది. ఈ సంత ద్వారా కెనమాకులపల్లె పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా మౌలిక వసతులు మాత్రం శూన్యం. సంతల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే వాటిలో బడుగుమాకులపల్లె ఆదివారం వారపు సంత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఏడాదికి సుమారు రూ.20 లక్షలు ఆదాయం వస్తోంది. 17ఏళ్లక్రితం అప్పటి సర్పంచ్ గోవిందస్వామి వ్యాపారులకు, ప్రజలకు తాగునీటి వసతి కల్పించేందుకు ఒక సింథటిక్ ట్యాంకు, పశువులు దాహం తీర్చుకోవడానికి 4 తొట్టెలు నిర్మించారు. తరువాత కొంత కాలానికి వాటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరో తొట్టెలు ధ్వంసం చేశారు. దీంతో నీటి సమస్య యధావిధిగా మారింది. సంత జాతీయ రహదారిపై నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సంతలో షెడ్లు లేకపోవడంతో వ్యాపారస్తులు గుడారాలు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. సంతలో షెడ్లు నిర్మించి, నీటి వసతి కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను అడుగుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంతను అనువైన ప్రదేశానికి మార్చి అక్కడ అన్ని వసతులు కల్పిస్తే కెనమాకులపల్లె పంచాయతీ మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



కుప్పం-పలమ నేరు జాతీయ రహదారిపైనే జరుగుతున్న సంత

సదుం ఎంపీపీగా ధనంజయ రెడ్డి ఏకగ్రీవం



ఎంపీపీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

సదుం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): సదుం నూతన ఎంపీపీగా ధనంజయరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అమరావతి పుత్రాజు అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీగా ఉన్న ఎల్లప్ప ఇటీవల హఠాన్మరణం చెందారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జ్ ఎంపీపీగా కొనసాగుతున్న ధనంజయరెడ్డిని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ధనంజయ రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించారు. అనంతరం మండలంలోని వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు చేయకూడదని జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి సభ అధ్యక్షులకు విజ్ఞప్తి చేశారు. తిమ్మానాయనపల్లె పంచాయతీకి ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచు మురళీధర్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ప్రతి నెలా 5వ తేదీలోపు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం ఇచ్చే బియ్యం సరఫరా కావాలని అంగన్‌వాడీల సంఘం నేతలు కోరారు. దిన్నెవడ్డిపల్లెలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని సర్పంచ్ జగన్నాథం విన్నవించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, వైస్ ఎంపీపీ అమరావతి పుత్రాజు, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, నాయకులు తిమ్మారెడ్డి, శివారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, పంచాయతీ, సచివాలయ, ఉపాధి,హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో జడ్జిల తనిఖీలు





కుప్పం మండలం పరమసముద్రంలోని విద్యాలయం, పలమనేరు గురుకుల పాఠశాలలో జడ్జిలు అరీఫాషేక్, జడ్జి లిఖిత తదితరులు

కుప్పం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పరమసముద్రంలోని గురుకుల విద్యాలయాన్ని శనివారం కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అరీఫాషేక్ తనిఖీ చేశారు. ఆమె విద్యార్థులతో సంభాషించి విద్యాలయంలో వసతులు, బోధన, సమస్యలపై ఆరా తీశారు. ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

గంగవరం : పలమనేరు సమీపంలోని గురుకుల పాఠశాలను జూనియర్ సివిల్ జడ్జి లిఖిత శనివారం తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సామగ్రిని, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాయంత్రం అందించే అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యబృందానికి సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించి, మంచి మార్కులు సాధించేలా బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బరకత్, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికంలేని సమాజమే చంద్రన్న ధ్యేయం

- ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం



అనెకర గ్రామంలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

శాంతిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పేదరికంలేని సమాజమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం అన్నారు. మండల పరిధిలోని అనెకర, కోనేరుకుప్పం, చెంగుబల్ల, 121పెద్దూరు, రేగడదిన్నేపల్లె పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. అనెకర పంచాయతీలో పీఎస్ మునిరత్నం సీసీ రోడ్లకు, గోకులం షెడ్లుకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో పాడి పరిశ్రమను అభివృద్ధి పరచాలని రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేశారన్నారు. పల్లెల్లో అభివృద్ధి జరగాలని సీసీ రోడ్లు మంజూరు చేశారని తెలిపారు. ప్రతి పేద వాడి న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు భావ్యం విశ్వనాథ నాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయ కుమార్‌నాయుడు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, రెస్కో మాజీ వైస్ ఛైర్మన్ చలపతిస్వామి, టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి, పీవి నాగరాజు కోలాలతిమ్మనపల్లె, శెట్టిబల్ల, 121పెద్దూరు, రేగడదిన్నేపల్లె గ్రామాలలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. గోకులం షెడ్లు మంజూరు పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత అర్జునప్ప, మండల వన్నియకుల క్షత్రియులు గోవిందరాజులు, చంద్రశేఖర్ రెడ్డి, లోకేష్, సుబ్రమణ్యం, ప్రసాద్, రమేష్, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, ఏపీవో హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అనేక ప్రయోజనాలు



చంద్రమాకులపల్లెలో పొలంబడి కార్యక్రమం

పుంగనూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు అనేక ప్రయోజనాలు పొందవచ్చునని పుంగనూరు వ్యవసాయశాఖాధికారి ఫయాజ్ తెలిపారు. శనివారం మండలంలోని చంద్రమాకులపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పంటలు, సస్యరక్షణ, నూతన పద్ధతులు జోడించి రైతులు పెట్టుబడిని తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చునని వివరించారు. పంటలసాగుపై రైతులు ఎప్పటికప్పుడు కొత్తవిషయాలు నేర్చుకుని ఇతర రైతులకు వివరించడం ద్వారా అందరూ మంచి పంటల దిగుబడి సాధించి ఆర్థికంగా బలోపేతం అవుతారని చెప్పారు. పంటలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా రైతులు తమ దృష్టికి తీసుకురావాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటించి అధిక ప్రయోజనాలు పొందాలని కోరారు. పంటలకు చీడపీడల నివారణకు డ్రోన్ యంత్రం ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం వల్ల ఉపయోగాలను ఆయన వివరించారు.

బాలికను వంచించిన మాజీ వలంటీర్‌ను శిక్షించాలి

రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు షణ్ముగం

కుప్పం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : బాలికను వంచించి గర్భిణీని చేసిన మాజీ వలంటీర్‌ను కఠి నంగా శిక్షించాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు షణ్ముగం డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రులతో కలిసి రజక సం ఘం నాయకులు శనివారం కుప్పం డీఎస్పీ పార్థసారధికి మాజీ వలంటీర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ రజక కుటుంబానికి చెందిన బాలికను మాజీ గ్రామ వలంటీర్ వెంకటాచలం మాయమాటలతో నమ్మించి గర్భిణీని చేయడం బాధాకరమన్నారు. ఇంతటి ఆఘాత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రజక సఘం నేతలు రంగనాథం, సీఆర్ మోహన్, దయ, నరేష్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు పోత్సాహకాలు

రొంపిచెర్ల, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి) మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టరు సరళ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో గతనెలలో చిన్న కుటుంబాలు వరం కాదు శాపం అనే అంశం మీద జరిగిన చర్చా కార్యక్రమంలో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులు భరత్‌కుమార్, రిషిత, ఎనిమిది తరగతి విద్యార్థి గురుశరణ్ అన్‌లైన్ చర్చలో పాల్గొని బహుమతులు సాధించినట్లు తెలిపారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీల్లో శనివారం సీసీ రోడ్డు పనులకు మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు భూమి పూజ చేశారు. ఏపీవో దినకర్‌బాబు, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, రవినాయుడు, బాలాజీ నాయుడు, గిరి, రెడ్డెప్పనాయుడు, కార్యదర్శులు మసూదబేగం, లలిత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు చల్లా బాబురెడ్డి పర్యటన

కల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం యర్రంవాడ్లపల్లి, ముల్లంగివారిపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమానికి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రా రెడ్డి హాజరవుతున్నారని టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

సోమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, సోమల పంచాయతీల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఏడీఏ శివకుమార్ శనివారం పరిశీలించారు. వరి పొలాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక వర్షాలకు టమోటా తోటల్లో మచ్చ తెగులు రాకుండా ముందస్తుగా 2.5 గ్రాముల డైత్రెన్ ఎం. 45, ఒక గ్రాము కార్బెండిజం లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలని తెలిపారు. బంతి, చామంతి పొలాల్లో నీరు నిలిస్తే వేరు కుళ్లు తెగులు వ్యాపిస్తుందని చెప్పారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో పంటల నష్టాలను ఆరా తీశారు. ఏవో సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకన్న



పుంగనూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో శనివారం అర్చకులు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు, అలంకరణలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తిరుపతి-తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి వార్లకు అభిషేకం, అర్చన, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు, తిరుపతి జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అధికారి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓగు సచివాలయం తనిఖీ



వి.కోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓగు గ్రామ సచివాలయాన్ని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. ఉదయం 11.30 గంటలైనా సచివాలయం తలుపులు తీయలేదు. పలు రకాల పనులతో అక్కడకు వచ్చిన జనం ఉద్యోగుల రాక కోసం వేచిఉన్నారు. అక్కడి పరిస్థితిని చూసి అవాక్కైన జడ్పీ ఛైర్మన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆపై ఎంపీడీవోకు ఫోన్ ద్వారా ఫిర్యాదుచేసి అందుబాటులోలేని సచివాలయ ఉద్యోగులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

యువతి అదృశ్యం

గంగవరం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేఆర్. కొత్తపల్లెకు చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. జేఆర్ కొత్తపల్లెకు చెందిన శంకరప్ప కుమార్తె వీణాకుమారి (21) చదువు పూర్తి చేసుకొని తల్లిదండ్రుల చెంతనే ఉంది. రెండురోజుల క్రితం ఉన్నట్లుండి కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. యువతి తండ్రి శంకరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మా కుమార్తె కనిపించకుండా పోవడానికి ఉల్లికుంటలో ఉన్న రాజేష్‌పై అనుమానంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

పుంగనూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్రపల్లె, కమతంపల్లె గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని, సీసీ రోడ్లు తదితర పనులు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, టీడీపీ నాయకులు శమీపతి, గంగాధర్,గంగరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, గంగులప్ప, సుబ్రహ్మణ్యం, కృష్ణానాయక్, మోహన్ రెడ్డి, ఉపాధిహామీ, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిత్తూరు అభివృద్ధికి నిధులివ్వండి

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంపీ, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పరిధిలోని 280 చెరువుల మరమ్మతులు, నిర్వహణ, నూతన చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.33.44 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేసినట్లు వివరించారు. చిత్తూరు నగరంలోని నీవానది ఆధునికీకరణ కోసం రూ.175 కోట్లు మంజూరుచేయాలని కోరారు. 2018 టీడీపీ హయాంలో చిత్తూరు నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి అమృత్ పథకం కింద 75 శాతం పూర్తయిన అడవిపల్లె రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్‌ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసేందుకు నిధులు కావాలన్నారు. నియోజకవర్గంలో నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.11.50 కోట్లు, చిత్తూరులో యూనివర్సిటీ, చెన్నై - బెంగళూరు మధ్య చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతోపాటు టూరిజం, హెల్త్‌కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను ఎమ్మెల్యే కోరారు.

హైవే పనులు అడ్డుకోవద్దు: జేసీ


కళాగ్రాండ్ హోటల్ యజమానితో చర్చిస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులను అడ్డుకోవద్దని జేసీ విద్యాధరి సూచించారు. బలిజపల్లె వద్ద భూసేకరణ కింద కళాగ్రాండ్ హోటల్‌కు సంబంధించిన భూ పరిహారం యాజమాన్యానికి ఇప్పటికే చెల్లించిందన్నారు. ఈనేపథ్యంలో శనివారం కళాగ్రాండ్ హోటల్‌కి చెందిన భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించామని జేసీ తెలిపారు. అయితే యాజమాన్యం గడువు కోరగా మూడ్రోజులు మాత్రమే ఇస్తున్నామని, తర్వాత స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే అప్పటికీ యాజమాన్యం అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆమెతోపాటు ఎన్‌హెచ్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీనివాసులు, సర్వేయర్ లావణ్య ఉన్నారు.

అన్నదాన భవనాన్ని త్వరగా సిద్ధం చేయండి

● వరసిద్ధుడి ఆలయ ఈవో ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో భక్తుల రద్దీకి అనుగుణంగా నూతన అన్నదాన భవనాన్ని త్వరగా సిద్ధం చేయాలని వరసిద్ధుడి ఆలయ ఈవో గురుప్రసాద్ ఆదేశించారు. సామూహిక కల్యాణ మండప భవనాన్ని అన్నదాన భవనంగా మార్పు చేస్తున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, ఏఈ శివాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులను త్వరగా నిర్మించండి


వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ శంకర్‌నారాయణ

పాలసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పీహెచ్‌సీ ఆవరణంలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ శంకర్‌నారాయణ ఆదేశించారు. శనివారం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈనెల 16వ తేదీన కలెక్టర్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనులు ఆలస్యంగా జరుగుతున్న విషయాన్ని వైద్య సిబ్బంది తెలియజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులొచ్చి పరిశీలించారు. ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈ ఆనందరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు చైతన్య ఎంపిక



చైతన్యతో హెచ్ఎం, పీడీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 ఎనిమిది కిలోమీటర్ల బాలుర సైక్లింగ్ విభాగంలో తాళంబేడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన కె.చైతన్య మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం పూతలపట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా సైక్లింగ్ పోటీలు జరిగాయి. మొదటి స్థానంలో చైతన్య నిలవడం పట్ల హెచ్ఎం శ్రీదేవి, పీడీ ఉమాపతి హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 22 నుంచి 26వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పీవీకేఎన్ కళాశాల గ్రౌండ్స్‌లో టపాకాయల విక్రయాలు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పురస్కరించుకుని నగరంలో టపాకాయల అమ్మకానికి పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌ను ఖరారు చేసినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం తన చాంబర్‌లో అగ్నిమాపక, పోలీసు, విద్యుత్, మార్కెటింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు టపాకాయల అసోసియేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. వన్‌మెన్ కమిటీ నిబంధనల ప్రకారం మార్కెట్ యార్డు, పీవీకేఎన్ కళాశాల గ్రౌండ్స్ పరిశీలించామన్నారు. పీవీకేఎన్ క్రీడా మైదానం ప్రజలకు సౌకర్యంగా గుర్తించినట్లు తెలిపారు.

అనుమతి తప్పనిసరి

గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టపాకాయల విక్రయాలకు అనుమతి తప్పనిసరి అని సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. మండలంలో అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

శుభ్రమైన నీవానది



చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో నగర పరిధిలోని నీవానదిని శుభ్రంచేసే పనుల్లో నగరపాలక అధికారుల నిమగ్నమయ్యారు. గత ఏడాది వర్షాలు కురిసినప్పుడు నీవానది పొంగి.. సమీప కాలనీలు నీటమునిగాయి. వారం పాటు నిరాశ్రయులను ఇతర ప్రాంతాలకు తరలించారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాలు కురుస్తుండటంతో పారిశుధ్య పనులతోపాటు పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని రెండ్రోజులుగా చేస్తున్నారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాంబ హుండీ ఆదాయం రూ.4.57లక్షలు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయ హుండీ లెక్కింపును శనివారం ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. రూ.4,57,586లను కానుకలుగా భక్తులు సమర్పించారని ఈవో తెలిపారు. పాలక మండలి సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో మాస మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బాబాకు పూజలు చేసి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి వార్డులోని గర్భిణులకు కిట్స్, స్వామి వారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

వరదమ్మ కాలనీని పట్టించుకోరా?

● అన్నీ మట్టి రోడ్లే.. కాలువలూ లేవు


కాలువల్లేక ఇంటి ముందే మురుగు


వరదమ్మకాలనీలో మట్టిరోడ్డు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 50వ డివిజన్ వరదమ్మకాలనీలో మౌలిక వసతుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ పరిధిలో 200 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. చాలావరకు దినసరి కూలీలే. కాలనీలో ఏ వీధికి వెళ్లినా మట్టిరోడ్లే దర్శనమిస్తాయి. దీనివల్ల వర్షాకాలంలో వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. కాలువలు కూడా లేకపోవడంతో ఇళ్ల పక్కనే గుంతలు తవ్వుకుని మురుగును వదులుకుంటున్నారు. దీనివల్ల దోమల బెడదతోపాటు దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్య కార్మికులు పది రోజులకు ఒకసారి కూడా ఇక్కడ వ్యర్థాలను తీయడం లేదు. వీధుల్లో కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అబద్ధాలతో జనాన్ని మోసగిస్తున్న జగన్: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అబద్ధాలతో జనాన్ని మోసం చేస్తున్నారని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా.. 11 సీట్లకే పరిమితం చేసినా జనాన్ని ఇంకా మోసగిస్తూనే ఉన్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలవారూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. అటువంటి జగన్‌కు సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. పార్టీ కార్యాలయ జిల్లా కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు గోకుల్, యువరాజ్, ధరణి ప్రకాష్, కరుణాకర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మెసానికల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు పీసీఆర్ ఉన్నత పాఠశాల పీడీ, బాస్కెట్ కోచ్ బాబు తెలిపారు. జిల్లా బాస్కెట్ బాల్ సంఘం నాయకుడు ఎస్పీ జయప్రకాష్ నాయుడు మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగి ఎంపిక పోటీలకు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. సంఘం నాయకులు లక్ష్మీపతి నాయుడు, కృష్ణమూర్తి, విశ్రాంత పీడీ కుమార్, పీడీలు జేమ్స్, నాగరాజు అజీమ్, గిరిజ, ఉషారాణి, అన్సర్‌బాషా, అరవింద్‌లు రెఫరీలుగా వ్యవహరించారు.

అండర్-14 జట్లలోని క్రీడాకారులు: బాలుర జట్టులో.. సాయి సంతోష్, భరత్, భనిత్, జయసాయి, దీపేస్, ఫైజల్, అభిన్వ, మౌనిష్, పుష్కర్, ప్రణీత్, అక్షయనాయక్, దిలీప్ ఉన్నారు. ● బాలికల జట్టులో.. రిషిత, అంజలి, జన్నిసాహితి, జేబీ, జస్మిన్, వైనవి, వర్షన, బిందుశ్రీ, జన్నవి, హర్షిత, సోనల్, లక్ష్మీ, దొరణి, భవ్య ఉన్నారు.

అండర్-17 జట్లలోని క్రీడాకారులు: బాలుర జట్టులో.. చేతన్, దిలీప్, లలిత్, యూనస్, యశ్వంత్, అరవింద్, ఆర్యన్, యశ్విన్, షహీద్ రఫిన్, మోతీస్ బాలాజి, సాయిప్రణీశ్వర్, లలిత్‌కుమార్, దివాకర్, గిరిధర్ ఉన్నారు. ● బాలికల జట్టులో.. లాస్వి, లాలిత్య, బిష్మ, వర్షిత, హిందూ, సరయు, ధరణి, హిందుప్రియ, స్నేహ, ప్రణతి, కావేరి, కీర్తి, జయజ్ఞ, సుజాత ఉన్నారు.



అండర్ - 17, అండర్ - 14 జట్లలోని క్రీడాకారులు

మాగోడు పట్టించుకోరా?: విద్యార్థుల ఆవేదన


సాయంత్రం ఆరు గంటలకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ గోడు పట్టించుకోరా.. అంటూ నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్సు సాయంత్రం నాలుగు గంటలకు పాఠశాల వద్ద ఉండేలా చూడాలని అధికారులకు విద్యా కమిటీ చైర్మన్, హెచ్ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. అయినా బస్సు మాత్రం రోజూ సాయత్రం ఆరు గంటలకు వస్తోంది. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతు సేవా కేంద్ర భవనం పూర్తయ్యేదెన్నడు?



వెదురుకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కార్వేటినగరం మండలం గాజుంకి రైతు సేవా కేంద్రానికి రూ.21.80లక్షలు ప్రకటించారు. కానీ, ఇప్పటికీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. మొండిగోడలతో ఉన్న ఈ భవనంలో పట్టపగలే మద్యం ప్రియులు వెళ్లి మద్యం తాగుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

2011 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులూ వివరాలివ్వండి

● నగరి రిటైర్డ్ ఉద్యోగ సంఘం

నగరి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 2011 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ వివరాలను నగరి రిటైర్డ్ ఉద్యోగ సంఘం కార్యాలయంలో సమర్పించాలని కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం తెలిపారు. పదవీ విరమణ తర్వాత తాము తీసుకున్న కమ్యూటేషన్ మొత్తాన్ని 15 ఏళ్ల వరకు నెలనెలా మినహాయిస్తున్నారన్నారు. దీనిపై హర్యానా రాష్ట్రంలో ఉద్యోగులు ప్రభుత్వంపై హైకోర్టుకు వెళ్లి, తమకు 12 ఏళ్ల వరకు మాత్రమే నెలనెలా మినహాయించాలని కేసు వేయగా అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులు కూడా కోర్టుకు వెళ్లేందుకు సమాయత్తం కావాలని కోరారు. దీనిపై ఈనెల 27వ తేదీన నగరి యూనిట్లలో జరిగే సమావేశానికి రిటైర్డ్ ఉద్యోగులంతా హాజరు కావాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 13 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగిన 13 మందిని శనివారం జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా వేశారు.

బంగారుపాళ్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేయగా మద్యం తాగి నడుపుతున్న నలుగురిని గుర్తించామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. వీరితోపాటు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన 12మంది పట్టుబడ్డారని చెప్పారు. వీరిని శనివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగినవారికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారన్నారు.

కోటచెరువు కాలనీలో తాగునీటి కష్టాలు


వ్యవసాయ బోరు వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

వెదురుకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కోటచెరువు కాలనీలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. గ్రామానికి తాగునీటి సరఫరా వారం రోజులుగా నిలిపివేయడం వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. నీటి సదుపాయం లేకపోవడం వల్ల వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని చెప్పారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



ఐరాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో ఇటీవల జరిగిన అండర్-17 పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రెడ్డిప్రసాద్, మహేష్, జీవన్‌సాయి, రోహిత్, రంజిత్‌లు ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోమల తెలిపారు. వీరు నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్లారని చెప్పారు. ఈ సందర్భంగా ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తిక్‌ను ఆమె అభినందించారు. పీడీ దేవా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు పూతలపట్టు మండల మీట్

పూతలపట్టు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరుగనున్నట్లు ఎంపీడీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పొలాలను పరిశీలించిన అధికారులు

వెదురుకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె, ముక్కరవానిపల్లె గ్రామాల్లో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగపద్మిని, ఏవో హేమలత పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. వీఏఏ కుసుమ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం కృత్తికను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఉర్దూ పాఠశాలలో తనిఖీలు

నగరి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేలావడి ఉర్దూ పాఠశాలను శనివారం నగరి ఎంఈవో శ్రీదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమీక్షించారు. ప్రణాళికా బద్ధంగా బోధన చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నగరి విద్యార్థి



నగరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన జిల్లాస్థాయి అండర్-14 చెస్‌పోటీల్లో నగరి విద్యార్థి రిషి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యాడు. ఈ మేరకు అవర్ లేడీ ఆఫ్ మెర్సీ స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ ప్రభా తెలిపారు. శనివారం ఆ విద్యార్థిని సిబ్బందితో కలిసి అభినందించారు.

పారిశుధ్య పనులు

విజయపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బూచివానత్తంలో శనివారం సర్పంచ్ గోపాల్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు తొలగించి, ముళ్ల పొదలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి, బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్



గుడిపాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడానికే గుడిపాలలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు దాతల సహకారంతో ఉచితంగా క్యాంటీన్‌ను నిర్వహించామని చెప్పారు. ఇక నుంచి కేవలం రూ.5లకే భోజనాన్ని పెడుతున్నామన్నారు. టీడీపీ నేతలు గుర్రప్పనాయుడు, గోవిందుగౌడ్, రంగారెడ్డి, పెరుమాళ్, చల్లా తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

నింద్ర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాలకు మహర్దశ పట్టనుందని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ అన్నారు. శ్రీరామపురం, కావనూరు, నింద్ర, ఇరుగువాయి పంచాయతీల్లో సిమెంట్ రోడ్లకు, కాలువలు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, సర్పంచ్‌లు జయమ్మ, మహేష్, వసంత, రాజేష్, నాయకులు దశరథవాసు, మనోజ్ యాదవ్, అప్పారావు, ఢిల్లీ నాయుడు, ప్రసాద్ రెడ్డి, ప్రకాష్, మురళి, బుచ్చి, స్వయరాజ్, ఇళయరాజా పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పిళ్లారికుప్పం గ్రామ పంచాయతీలో రూ.15లక్షలతో నిర్మించనున్న కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నీరంజన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, ఎంపీడీవో మురళీమోహన్, ఏపీవో చంద్రశేఖర్, నాయకులు హేమాద్రి యాదవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: ఓటివారిపల్లె గ్రామ పంచాయతీ కె.గొల్లపల్లెలో రూ.6లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొర్సాల్టీ యాదవ్, సర్పంచ్ పత్తిపాటి భగవతి, ఏపీవో బాల, పంచాయతీ అధికారులు శైలజ, వెంకటేష్, సుమతి, శ్రీనివాసులు, నాయకులు హేమగిరి, వల్లేరు అమర్‌నాథ నాయుడు, వెంకటేష్ రటీ, హేమయ్య నాయుడు, వేణుగోపాల్ నాయుడు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు, చిప్పారపల్లె పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండు వద్ద నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. పాళ్యం యానాదికాలనీలో నూతన రోడ్డుకు శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్, సెక్రటరీ ప్రభుకిరణ్, మాజీ సర్పంచ్ రాజగోపాల్ నాయుడు, బాలాజి, ఉపాధి సిబ్బంది పరదేశి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరణ్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: కట్టప్పగారిపల్లె గ్రామంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీ ప్రసాద్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, తెలుగు యువత నాయకుడు రమేష్, బీసీ నాయకులు హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ భువనేశ్వరి, హరి, దేవయాని, లక్ష్మీకుమార్, సాయి ఉదయ్, హేమచంద్ర, సాంబయ్య, వంశీ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలో రూ.64లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు రవికుమార్ యాదవ్, సంధాని, ఈవో నాగరత్నమ్మ పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలం మాంబేడు ఏఏడబ్ల్యాలో సిమెంటు రోడ్డు పనులను టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, టీడీపీ నేత యుగంధర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే థామస్ చొరవతో సిమెంటు రోడ్డు నిర్మించే అవకాశం వచ్చిందని చెప్పారు.

విజయపురం: గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో రమణప్రకాష్ అన్నారు. చిన్నజంబాడ, కోసలనగరం, కేశవపురం ఎస్టీ కాలనీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ రవిరాజు, నాయకులు కొండూరు దామోదర్‌రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.